క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తత అవసరం



కంకిపాడు: వ్యాధులపై అప్రమత్తత అవసరమని వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసుజా అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గొడవర్రు గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. జ్వరాలు, వాంతులు, విరేచనాలపై ఇంటింటి సర్వే చేపట్టారు. వాటర్ ట్యాంకుల వద్ద నీటి నమూనాల సేకరణ, క్లోరినేషన్ పరీక్షలు చేయించారు. వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసుజా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల వద్ద మురుగు నిలిచి ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసరపల్లి, అజ్జంపూడి, బుద్దవరం, బూతుమిల్లిపాడు, కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. అదే విధంగా వ్యవసాయ వినియోగదారులకు ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 6 గంటల వరకు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

108లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన గర్భిణి



గన్నవరం: ప్రసవ వేదనతో బాధపడుతున్న ఓ గర్భిణి 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎల్‌అండ్‌టీ మిషనరీ మెకానిక్‌గా పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన భగవాన్‌దేవ్, అతని భార్య పోలే లక్ష్మి మండలంలోని సూరంపల్లిలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రసవ నొప్పులతో బాధపడుతున్న లక్ష్మిని ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. దీంతో నున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. అనంతరం తల్లీ బిడ్డను విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా సమయ స్ఫూర్తితో వ్యవహరించిన అంబులెన్స్ ఈఎంటీ వెంకయ్య, పైలెట్ శ్రీనివాసరావును లక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి నిర్మూలనపై చైతన్యవంతులు కావాలి



పెనమలూరు: అవినీతి నిర్మూలనపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని పీఎన్‌బీ సర్కిల్ హెడ్ డీజీఎం అభిజిత్‌సిన్హా అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా సోమవారం కామయ్యతోపు సర్కిల్ కార్యాయలం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం అభిజిత్‌సిన్హా మాట్లాడుతూ.. సమాజం అవినీతి రహితంగా మారాలన్నారు. బ్యాంకు ఉద్యోగులు విధులు నిర్వహించే సమయంలో చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బందితో సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సీఎస్ఆర్ కార్యాచరణ కింద ప్రకాశం జిల్లాలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గాయాలు

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గాయాలు అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నున్న ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రాంతానికి చెందిన చాపరాల శ్రీలక్ష్మి అమృత సాయి ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆమె ఆదివారం కానూరు 100 అడుగుల రోడ్డులో పరీక్ష నిర్వహించేందుకు స్కూటర్‌పై బయలుదేరారు. ఆమె స్పీడ్ బ్రేకర్ దాటుతున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ స్కూటర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గోతులమయంగా లోకల్ బైపాస్ రోడ్డు

- నున్న మ్యాంగో మార్కెట్ నుంచి రామచంద్రపురం వరకు అన్నీ గోతులే
- అధ్వాన రహదారితో ప్రయాణికుల అవస్థలు



నున్న లోకల్ బైపాస్ రోడ్డు దుస్థితి

విజయవాడరూరల్: నున్న లోకల్ బైపాస్ రోడ్డు గోతులమయంగా ఉంది. ఆ రహదారిపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. గోతులు లేని రహదారులను అభివృద్ధి చేస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం నున్న లోకల్ బైపాస్ రోడ్డును ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల వచ్చిన వరదల్లో రోడ్డు నాణ్యత దెబ్బతిని ఎక్కడంటే అక్కడ రోడ్డు మొత్తం గోతులు పడి, రహదారి రూపాన్ని కోల్పోయింది. నున్నలో మ్యాంగో మార్కెట్ కారణంగా తరుచుగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండేది. ట్రాఫిక్ సమస్య లేకుండా చేసేందుకు మ్యాంగో మార్కెట్ నుంచి రామచంద్రపురం అడ్డరోడ్డు వరకు లోకల్ బైపాస్ రోడ్డును 9 సంవత్సరాల క్రితం నిర్మించారు. విజయవాడ – నూజివీడు ఆర్‌అండ్‌బీ రహదారిలో 10.6 కిలో మీటరు నుంచి 16 కిలోమీటరు రోడ్డు వరకు రైతుల నుంచి భూములను సేకరించి 10.50 కోట్ల రూపాయలతో రోడ్డును నిర్మించారు.

ప్రమాదాలకు నెలవు..

విజయవాడ నుంచి నూజివీడు, తిరువూరు, సత్తుపల్లి పరిసర ప్రాంతాలకు వెళ్లాల్సిన నాన్‌స్టాప్ బస్సులు, కాలేజీల బస్సులు, నూజివీడు ట్రిబుల్ ఐటీకి వెళ్లే వాహనాలతో పాటు భారీ వాహనాలు ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తుండేవి. మ్యాంగో మార్కెట్‌కు వచ్చే వాహనాలు నున్న గ్రామంలోకి రాకుండా బైపాస్ నుంచి రాకపోకలు సాగేంచేవి. ప్రస్తుతం ఆ రోడ్డు పెద్ద పెద్ద గోతులు పడటంతో భారీ వాహనాలు అటు వైపు వెళ్లడం లేదు. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగి రోడ్డుపైకి వచ్చి వాహనం సరిగ్గా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గొల్లపూడి కాల్వ క్రాస్ వద్ద భారీ గోతులు పడి ప్రమాదాలకు నెలవుగా మారాయి. పెట్రోల్ బంకు వద్ద కూడా వన్‌సైడ్ పెద్దగా గోతులు పడి ఉండటంతో సూరంపల్లి ఇండస్ట్రీస్‌కి వెళ్లాల్సిన భారీ వాహనాలు నున్న గ్రామం లోపలకి వచ్చి వెళ్లడంతో ప్రతి రోజూ గ్రామంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈ రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్య నిత్యం ఏర్పడుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

గోతులను పూడ్చాలి..



లోకల్ బైపాస్ రోడ్డులో ఏర్పడిన గోతులను పూడ్చి, రోడ్డు పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి తీసుకురావాలి. భారీ వాహనాలు కూడా గ్రామంలో నుంచి రాకపోకలు సాగిస్తుండటం వలన ప్రజలు అవస్థలు పడుతున్నారు.

– పి.కోటేశ్వరరావు, స్థానికుడు

ప్రయాణికులకు ఇబ్బందులు



లోకల్ బైపాస్ రోడ్డులో ఏర్పడిన గుంతల వలన ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణం సాఫీగా సాగాలంటే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి అభివృద్ధి చేయాలి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– ఎ.కోటిరెడ్డి, స్థానికుడు

చోడవరం ఇసుక క్వారీలో చెలరేగిన మాఫియా



చోడవరం ఇసుక క్వారీ

పెనమలూరు: కూటమి పాలనలో ఇసుక మాఫియా చెలరేగిపోతున్నారు. కోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తూ చోడవరం ఇసుక క్వారీలో మరలా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. అయితే ఇసుక మాఫియాలో విబేధాలు రావటంతో క్వారీలో సోమవారం ఘర్షణ జరిగింది. చోడవరానికి చెందిన వ్యక్తిపై పలువురు దాడి చేయటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్వారీపై గతంలో డిస్ట్రిక్ట్ మైన్స్ అండ్ జియాలజీ అధికారి(డీఎంజీవో) పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటనపై కేసు నమోదు చేశారు. అయినా పోలీసుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ దందా జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే మండల పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం ఇసుక క్వారీలపై నిషేధం ఉంది. గతంలో చోడవరం ఇసుక క్వారీలో అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయని సుప్రీం కోర్టులో కేసు వేయటంతో కోర్టు విచారణకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఈ ఏడాది మే నెలలో జాయింట్ తనిఖీ జరిగింది. పర్యావరణ అనుమతులతో పాటు ఇతర అనుమతులు లేవని జాయింట్ తనిఖీలో తేలటంతో డీఎంజీవో పెనమలూరు పోలీసులకు ఈ ఏడాది జూలైలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్రమ తవ్వకాలు చేసిన సంస్థపై కేసు నమోదు చేశారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

కోర్టు ఆదేశాలతో డీఎంజీవో నివేదిక ఉన్నా చోడవరం క్వారీలో టీడీపీ నేతల అండదండలతో అక్రమ ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ఒకేసారి 150 ట్రాక్టర్లు ఆదివారం క్వారీలో దిగి యంత్రాలతో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. దీంతో మాఫియా చెలరేగి పోవటంతో వారిలో వారికే సోమవారం ఘర్షణ జరిగింది. అనీల్ అనే వ్యక్తి పై పలువురు దాడి చేశారు. బాధితుడు పెనమలూరు పోలసులకు ఫిర్యాదు చేశాడు. కోర్టు ఆదేశాలు అమలు చేయాల్సిన రెవెన్యూ, మైన్స్, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు.

క్షీణిస్తున్న శాంతిభద్రతలు

పెనమలూరు పోలీసుల వైఖరి కారణంగా శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో డీఎంజీవో ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇసుక దందాలో పోలీసుల పాత్ర ఉందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఇసుక మాఫియా చెలరేగి ఘర్షణలకు దిగుతున్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో సెయింట్ జాన్స్‌కు ప్రథమ స్థానం



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్

గన్నవరం: రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని వీఎస్ సెయింట్ జాన్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో క్విజ్ పోటీల విజేతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విజయవాడలోని సెయింట్ మాథ్యూస్ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 1న బ్రదర్ జేమ్స్ మెమోరియల్ 37వ రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 16 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఉత్కంఠభరితంగా జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఎస్.ఆరాధ్య, ఎ.గాయత్రికృష్ణ, కృష్ణదీపు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వీరికి రూ.7 వేలు నగదు బహుమతులు, రోలింగ్ ట్రోఫీ, పతకాలను అందజేశారని చెప్పారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను, వీరికి మార్గదర్శకులైన రెవ.బ్రదర్ జిమ్మికు రియోకోస్, సూర్యనారాయణను ప్రిన్సిపాల్‌తో పాటు బ్రదర్ భల్లా జోసఫ్, బ్రదర్ జయబాలన్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

డ్వాక్రా గ్రూపులకు రుణ సదుపాయం



మాట్లాడుతున్న ఏపీఎం చంద్రశేఖర్‌రావు

అంబాపురం(విజయవాడరూరల్): డ్వాక్రా గ్రూపులు తయారు చేస్తున్న ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్, రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వెలుగు ఏపీఎం జి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. అంబాపురం గ్రామంలో డ్వాక్రా గ్రూపుల సభ్యులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర కింద రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గరిష్టంగా రూ.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ ప్లాట్ ఫారం ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. సెర్ప్ సహకారంతో మై స్టోర్ టెక్నాకల్ ఏజెన్సీ ద్వారా డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్‌లో విక్రయాలకు పెట్టే వీలుంటుందన్నారు. ప్రతి గ్రామైఖ్య సంఘం నుంచి ఒక డ్వాక్రా సంఘాన్ని ఓఎన్‌డీసీలో చేర్చాలని సమావేశంలో చర్చించారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, కొత్తూరు తాడేపల్లి క్లస్టర్ పరిధిలోని వీఓఏలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



హనుమాన్‌జంక్షన్ రూరల్: జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం పి.నిర్మల సోమవారం తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సమాజానికి పోలీసుల సేవలు' అనే అంశంపై పోలీస్ శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కె.నాగ దినేష్ ద్వితీయస్థానాన్ని సాధించినట్లు ఆమె వివరించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు చేతుల మీదగా మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నాగ దినేష్ ప్రశంసాపత్రం స్వీకరించటంతో పాటుగా రూ.3 వేలు నగదు బహుమతి అందుకున్నాడని హెచ్‌ఎం తెలిపారు.

ఆర్గానిక్ కూరగాయల విక్రయ కేంద్రం ఏర్పాటు



హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక మహాత్మా గాంధీనగర్‌లోని మండల మహిళా సమాఖ్య ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రకృతి వ్యవసాయదారులు పలురకాల కూరగాయలను తీసుకుని వచ్చి అమ్మకాలు సాగించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రతి సోమవారం వీక్లీ ఆర్గానిక్ వెజిటబుల్ మార్కెట్ కొనసాగుతుందని చెప్పారు. మండల కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆకుకూరలు, కూరగాయలు కొనుగోలు చేశారు. ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులైన కూరగాయలు అందుబాటులోకి తీసుకురావటంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ నాగేశ్వరరావు, ఎంఎంటిఎల్ మీను మాధుర్య, ఎస్ఎఫ్ఎఫ్ సింధు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో ఉజ్వల భవిష్యత్



శిక్షణకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో వార్షిక శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. పది రోజుల పాటు జరిగే ఈ క్యాంప్‌లో ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, సీబీఎస్‌సీ, పీబీ సిద్ధార్థ తదితర కళాశాలకు చెందిన 266 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రేరణ తరగతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ తీర్థప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసే క్యాడెట్లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచి దేశభక్తి భావం కలిగి ఉండాలని చెప్పారు. ఎన్‌సీసీలో ఉత్తమమైన శిక్షణ పొందడం ద్వారా దేశానికి సేవచేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈ దిశగా ఎన్‌సీసీ క్యాడెట్లను తీర్చిదిద్దేందుకు వార్షిక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ పావనీ మానిక్యా, డాక్టర్ గీతాదేవి ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విపత్తుల సమయంలో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఐడీఎం జాయింట్ డైరెక్టర్ కల్నల్ రెడ్డి, ఐ.బాలు, ట్రాఫిక్ నిబంధనలను గన్నవరం ట్రాఫిక్ సీఐ వి.పెద్దిరాజు తెలిపారు.

కరాటేలో రాణించిన శ్రీ విశ్వశాంతి విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

ఉయ్యూరు: జాతీయ స్థాయి 23వ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఉయ్యూరు శ్రీ విశ్వశాంతి విద్యార్థులు తమ సత్తా చాటారు. విద్యాసంస్థల అధినేత మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మాదల సూర్యశేఖర్, సుష్మా సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. వారు వివరాలు తెలుపుతూ ఈ నెల 3న విజయవాడ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జేకె గోజు రియూ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 23వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. అండర్ – 14 కేటగిరీలో కుమితే విభాగంలో సీహెచ్ లలిత్ నాగసాయి ప్రథమ స్థానంలో, అండర్ – 17 బాలుర విభాగంలో కుమితేలో మిలన్‌కుమార్, బాలికల విభాగంలో తాన్యా అష్టా ప్రథమస్థానంలో నిలిచారన్నారు. అండర్–14 విభాగంలో కటాలో సీహెచ్ లలిత్ నాగసాయి తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారన్నారు. శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ పి.రామకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు.

కరాటే పోటీల్లో పతకాలు



కరాటే పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

పెనమలూరు: హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో యనమలకుదురుకు చెందిన ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ నెల 3న హైదరాబాద్ కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో 19వ జాతీయ కరాటే పోటీలు జరిగాయి. సీనియర్ 60 సంవత్సరాల విభాగంలో ఎస్.దుర్గారావుజోసెఫ్‌కు బంగారు పతకం, పి.భానుప్రకాష్‌కు 40 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం, ఆర్.ప్రభ 40 సంవత్సరాల మహిళల విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు అభినందన



విజేతలతో కళాశాల యాజమాన్యం

గన్నవరంరూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ప్రతిభ చాటాలని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి డెంటల్ సదస్సులో ప్రతిభ చాటిన డెంటల్ విద్యార్థులకు సోమవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. అక్టోబరు 26, 27 తేదీల్లో ఒంగోలులో జరిగిన 43వ రాష్ట్ర స్థాయి డెంటల్ సదస్సులో 700 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో శాస్త్రీయ పేపర్ ప్రజెంటేషన్‌లో పీడియాట్రిక్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ విభాగంలో పీజీ ఫైనలియర్ విద్యార్థి డాక్టర్ షేక్ షాహిద్ బాషా ప్రథమ బహుమతి, డాక్టర్ పి.సాయి రమ్య శ్రీ, డాక్టర్ ఎస్.మహతి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. ఆర్థోడాంటిక్స్ డెంటిస్ట్రీ విభాగంలో పీజీ సెకండియర్ విద్యార్థి డాక్టర్ ఎస్.మేఘన ద్వితీయ బహుమతి సాధించారు. బీడీఎస్ ఇంటర్న్‌షిప్ చేస్తున్న డాక్టర్ సీహెచ్ లక్ష్మీ కస్తూరి బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డును పొందారు. వీరందరిని సన్మానించి మాట్లాడుతూ వీరి స్ఫూర్తితో విద్యార్థులు మరిన్ని పోటీల్లో విజయాలు సాధించాలని వక్తలు ఆకాంక్షించారు. ఏవో వై.మధుసూదనరావు, హెచ్‌వోడీలు డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ అజయ్ బెనర్జీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పుష్పావతి, ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం తోట పుష్పావతి సోమవారం తెలిపారు. ఇటీవల ఒంగోలులో సృష్టి ఆర్ట్స్ అకాడమీ నేతృత్వంలో జరిగిన 'నేషనల్ చిల్డ్రన్ అండ్ యూత్ పెయింటింగ్ కాంపిటీషన్స్–2024' పోటీల్లో అప్పనవీడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు వివిధ కేటగిరీల్లో బంగారు పతకాలను సాధించారన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న మరో 75 మంది విద్యార్థులు కూడా మెరిట్ సర్టిఫికెట్స్‌ను సొంతం చేసుకున్నారని చెప్పారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయులు రజనీకాంత్ 'చిత్రకళ విపంచి' అవార్డును అందుకున్నారని హెచ్‌ఎం పుష్పావతి తెలిపారు. జాతీయ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చాటి పతకాలు సాధించిన 9మంది విద్యార్థులు, ప్రత్యేక అవార్డును అందుకున్న డ్రాయింగ్ టీచర్ రజనీకాంత్‌ను హెచ్‌ఎం పుష్పావతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మోగంటి లక్ష్మీదుర్గ, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



తెన్నేరులో సభ్యత్వం అందజేస్తున్న ఇమ్మానుయేలు

కంకిపాడు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు అన్నారు. సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండలంలోని తెన్నేరు, మంతెన, పునాదిపాడు, కంకిపాడు గ్రామాల్లో పర్యటించి సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇమ్మానుయేలు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు ఈనెల 6వ తేదీతో పూర్తవుతుందని, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలన్నారు. మధ్యంతర భృతి 35 శాతం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని 117 జీఓ రద్దు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఏ.శ్రీనివాసమూర్తి, మండల అధ్యక్షుడు పి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి టి.సాంబశివరావు, ఆర్థిక కమిటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లు పి.డి.ప్రసాద్‌రావు, కె.జె.మోహన్‌రావు, కంకిపాడు టీచర్స్ సొసైటీ అధ్యక్షుడు ఐ.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి : ఆరుగురి అరెస్ట్

10 రోజులు కోర్టు ప్రాంగణంలో నిలబడాలని న్యాయమూర్తి ఆదేశం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూద శిబిరంపై వీరవల్లి పోలీసులు దాడి చేశారు. బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురంలో ఆదివారం రాత్రి కోడిపందేలు నిర్వహిస్తున్నట్లుగా పక్కా సమాచారం అందుకున్న వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తన సిబ్బందితో దాడి చేశారు. దీంతో కంగుతిన్న జూదరులు ఒక్కసారిగా పరుగులు తీశారు. కాగా ఐదుగురు జూదరులతో పాటు రూ.7500 నగదు, రెండు కోడి పుంజులు, రెండు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కోడిపందేల నిర్వాహకుడు ఆర్నేపల్లి రవివర్మను సోమవారం అరెస్ట్ చేశామన్నారు. వీరందరిని నూజివీడు కోర్టుకు హాజరుపర్చగా, న్యాయమూర్తి శిక్ష, జరిమానా విధించారని తెలిపారు. ఆరుగురు జూదరులను 10 రోజుల పాటు కోర్టు ప్రాంగణంలో నిలబడాలని, రూ.50 వేలు పూచీకత్తు చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ చెప్పారు.

వైభవంగా కార్తిక పూజలు



యనమలకుదురులో శ్రీరామలింగేశ్వరస్వామి



పేరంటాలమ్మ ఆలయంలో రామలింగేశ్వరస్వామి



కంకిపాడులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గన్నవరం, పెనమలూరు నియోకవర్గాల్లోని శైవక్షేత్రాల్లో కార్తిక సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. ఉదయాన్నే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వార్లను దర్శించుకుని దీపాలు వెలిగించారు.

– పెనమలూరు/కంకిపాడు/రామవరప్పాడు/గన్నవరంరూరల్